ప్రజాశక్తి

బుధవారం 18 జూన్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, ర్యాలీని ప్రారంభిస్తున్న మురళీకృష్ణారెడ్డి

స్మార్ట్‌మీటర్లు వద్దు

గుడివాడలో సిపిఎం బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-గుడివాడ: స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ గుడివాడలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి ప్రారంభించగా పార్టీ కార్యాలయం నుండి గుడివాడ పురవీధుల్లో బైక్ ర్యాలీ సాగింది. స్మార్ట్‌మీటర్లు బిగిస్తే వచ్చే అనర్ధాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలను పంచుతూ బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో (మిగతా 2లో)

భూసేకరణను వేగవంతం చేయండి

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ



ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65ను ఆరు లైన్ల రహదారిగా విస్తరణ, పెడన-విసన్నపేట ఎన్‌హెచ్-216 విస్తరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ పనులను వేగవంతం చేసి నివేదికలను సమర్పించాలని ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ, ఔటర్ రింగ్‌రోడ్‌లకు భూసేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహణ వంటి పలు అంశాలపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేవం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జెసి మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్-65 రహదారికి (మిగతా 2లో)

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో గృహ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ పురోగతి సంతప్తి స్థాయిలో లేదని, కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కషి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో గోడల(లింటల్) స్థాయిలో(ఎల్ ఎల్)8,079 ఇళ్లు, పైకప్పు స్థాయిలో (ఆర్ ఎల్) 2,109 ఇళ్లు, రూఫ్ కాస్టింగ్ (ఆర్ సి) స్థాయిలో 446 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. గుడివాడ, గూడూరు, నందివాడ, పెదపారుపూడి, కోడూరు, పామర్రు, ఉయ్యూరు అర్బన్, మొవ్వ, చల్లపల్లి, అవనిగడ్డ మండలాలు పురోగతిలో చాలా వెనుకబడ్డాయని, మండల ప్రత్యేక అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతిలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకట్రావు, జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద కుమార్, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సందీప్ మృతిపై ఎన్నో అనుమానాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రజాశక్తి ఉద్యోగి మల్లవరపు రామారావు కుమారుడు సందీప్ మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దళిత సామాజిక వర్గానికి చెందిన సందీప్...ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సాయినగర్‌లోని స్వగృహంలోనే సోమవారం అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఆయన మృతిపై తండ్రి రామారావు, కుటుంబ సభ్యులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తండ్రి రామారావు కథనం ప్రకారం... కుమారుడు మరణించినట్లు సమాచారం రావడంతో రామారావు, ఇతర కుటుంబ సభ్యులు రామవరప్పాడు వెళ్లారు. సందీప్ మామ ఫోన్ చేసి ఈ విషయం చెప్పాడు. దీంతో వారు ఇంట్లోకి వెళ్లే సరికి సందీప్ మృతదేహం వంట గదిలో పడి ఉంది. ఉరివేసుకున్నట్లు భార్య లావణ్య, ఆమె తల్లిదండ్రులు చెబుతున్నా సంఘటనా స్థలంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పోలీసులుగానీ, చుట్టుపక్కల వారుగానీ ఎవరూ రాకుండానే ఉరి తాడును చాకుతో కోసి మృతదేహాన్ని కిందకు దించి ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. అలాగే చేతులు, కాళ్లు, తల వెనుక భాగంపై గాయాలు ఉండడం, ఈ సంఘటన గురించి లావణ్య, ఆమె తల్లిదండ్రులు చుట్టుపక్కల ఎవరికీ తెలియనీయకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చట్టుపక్కల వారిని పిలిచి లేక వారైనా కనీసం ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయకపోవడం, సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు



సమాచారం ఇవ్వకపోవడం, సందీప్ తండ్రి, ఇతర కుటుంబ సభ్యులకు చాలా ఆలస్యంగా మృతి విషయాన్ని తెలియజేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ఉన్నత సామాజిక వర్గానికి చెందిన లావణ్య, ఆమె కుటుంబ సభ్యులు ఉద్దేశపూర్వకంగానే హత్య చేసి ఉంటారని సందీప్ తండ్రి రామారావు చెబుతున్నారు. తన కుమారుడికి లావణ్యతో అసలు వివాహమే జరగలేదని, గతంలోనే ఆమెకు మరో వ్యక్తితో వివాహమైందని, వారికి కుమార్తె కూడా ఉందని, ఆ వ్యక్తికి విడాకులు కూడా ఇవ్వకుండానే దళిత సామాజిక వర్గానికి చెందిన తన కుమారుడిని లోబరుచుకుని మాయచేసి హత్య చేసిందని రామారావు చెబుతున్నారు. సందీప్ మృతిపై పలువురు దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిజిహెచ్‌లో పోస్టుమార్టం

సందీప్ మృతదేహానికి మంగళవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రి మార్చురీ విభాగంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని తండ్రి రామారావు, ఇతర కుటుంబ సభ్యులకు అప్పగించారు. సందీప్ అంత్యక్రియలకు తాము కూడా హాజరవుతామని లావణ్య, కుటుంబ సభ్యులు అనడంతో సందీప్ తండ్రి రామారావు, ఇతర కుటుంబ సభ్యులు నిరాకరించారు. పోలీసులు జోక్యం చేసుకుని మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వారి అనుమతి లేకుండా వెళ్లవద్దని సూచించారు. పోస్టుమార్టం అనంతరం సందీప్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామం గుంటూరు జిల్లా కురగల్లుకు తరలించారు. సాయంత్రం అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్లు ఓలేటి శ్రీనివాసరావు, వై.తిరుపాల్‌రెడ్డి, జి.శివరామకృష్ణ, కె.హరికిషోర్, కె.లక్ష్మయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విచారణ

సందీప్ మృతిపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. అనుమానాస్పదంగా మృతిగా భావించి బిఎన్ఎస్ సెక్షన్ 194 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి తండ్రి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని పటమట ఎస్ఐ దుర్గాదేవి విచారిస్తున్నారు. లావణ్యను ప్రశ్నిస్తున్నారు. కనీసం చుట్టు పక్కల వారికి కూడా సమాచారం ఇవ్వకుండా లావణ్య, ఆమె కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఎందుకు కిందకు దించారనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. మొదటి భర్త నుండి లావణ్య ఎందుకు విడాకులు తీసుకోలేదనే విషయాన్ని కూడా ఆరా తీస్తున్నారు. పోలీసుల విచారణ కొనసాగుతోంది.

మొదటిపేజీ తరువాయి

భూ సేకరణను వేగవంతం చేయండి

సంబంధించి 226 కిలోమీటర్ల ఆరు లైన్ల విస్తరణలో భాగంగా నందిగామ డివిజన్‌లోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగ్రంచిప్రోలు మండలాల్లో జాతీయ రహదారుల అధికారులకు ఎన్‌జాయిమెంట్ సర్టిఫికెట్లకు ప్రతిపాదనలు పంపాల్సి ఉందన్నారు. అనుమంచిపల్లి, షేర్‌మహమ్మద్‌పేట, తోటచర్ల, భీమవరం గ్రామాలకు సంబంధించి ఆయా మండల తహశీల్దార్లు ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెడన-విసన్నపేట జాతీయ రహదారి విస్తరణకు విసన్నపేట, తిరువూరు మండలాల్లో తొమ్మిది గ్రామాల నుండి ప్రతిపాదనలు రావాల్సి ఉండగా ఐదు గ్రామాలకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మిగిలిన గ్రామాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తిరువూరు ఆర్‌డివోకు సూచించారు. ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి సంబంధించి జాతీయ రహదారుల అధికారులు అవసరమైన భూమికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, రికార్డులను పరిశీలించి 3ఎ రిపోర్టు తయారు చేసి పంపాలన్నారు. ఇందుకు సంబంధించి కంచికచర్ల, మైలవరం, జి.కొండూరు మండలాల్లో 3ఎ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జాతీయ రహదారి గ్రీన్‌ఫీల్డ్ ఎలైన్‌మెంట్ సంబంధించి 273 ఎకరాలకు 243 ఎకరాలను సేకరించడం జరిగిందని, మిగిలిన 30 ఎకరాల పట్టా భూమిని సేకరించేందుకు 3ఎ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి భూములను సర్వే చేసి 3డి రికార్డులను సమర్పించాలన్నారు. భూములను సర్వే చేసేందుకు సర్వేయర్లు అందుబాటులో లేకుంటే ఇతర మండలాల నుండి సర్వేయర్లను డిప్యూటేషన్‌పై నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్‌డివోలు కె.చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, ఎన్‌హెచ్ ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్లు ఎం.విద్యాసాగర్ (విజయవాడ), ఎం రామాంజనేయ రెడ్డి (ఖమ్మం), టి.పార్వతీశం (అమరావతి), సంబంధిత మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

కాలుష్య రహిత విజయవాడకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ

వినూత్న విధానాలతో విజయవాడ నగరం వాయు కాలుష్యం బారిన పడకుండా సమిష్టి కృషి అవసరమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించేందుకు విజయవాడ నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. కాలుష్య నియంత్రణ, విజయవాడ నగరపాలక సంస్థ, రవాణా, పరిశ్రమలు తదితర శాఖలు వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన పనులు, వాటిలో పురోగతిపై సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. నగరం నలువైపులా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల డేటాను ఎప్పటికప్పుడు విశ్లేషించి దుమ్ముధూళీ వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. కాలుష్య రహిత ప్రయాణానికి వీలు కల్పించేలా రహదారుల నిర్మాణం, పేవ్‌మెంట్ రహదారుల ఏర్పాటు, హరిత విస్తీర్ణం పెంపు, మెకానికల్ స్వీపర్ల వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణ, కాలువ గట్ల హరిత సుందరీకరణ వంటి చర్యలను ముమ్మరం చేయాలన్నారు. సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ ద్వారా వాహనాల సాఫీ ప్రయాణంతో గాలి కాలుష్యం మోతాదును తగ్గించవచ్చని, ఇందుకు ఉపయోగపడే ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) పనులను రూ. 5 కోట్లతో చేపట్టడం జరిగిందని తెలిపారు. కాలుష్య కారకాలను వెదజల్లే వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీటీపీఎస్ బూడిద, ఇతర కాలుష్య కారకాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నియంత్రణపై తీసుకున్న చర్యలు, ప్రత్యామ్నాయ మార్గాలపై అన్ని విభాగాలు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీబీ



ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.శ్రీనివాస్, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) పి.సత్యకుమారి, ఏపీఐఐసీ జెడ్‌ఎం కె.బాబ్జి, వీటీపీఎస్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఆర్‌టీవో ఆర్.ప్రవీణ్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎస్‌వో ఎ.పాపారావు, డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు వద్దు

సుమారు 15 వేల కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని ధ్వంసం చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన లోకేష్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే స్మార్ట్ మీటర్లు బిగించడానికి ముందుకు రావడం శోచనీయమన్నారు. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం, గుడివాడ పట్టణాలను అమృత నగరాలుగా పేర్కొని ఈ నెల నుండి స్మార్ట్ మీటర్లు బిగించడానికి సిద్ధం కావడం తగదన్నారు. స్మార్ట్ మీటర్లపై, విద్యుత్ భారాలపై రాబోయే కాలంలో పోరాటాలను ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరరావు, శీలం



ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

నారాయణరావు, కోసూరి శివ నాగేంద్రం, కళ్లం వెంకటేశ్వరరావు, రక్షణ స్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌సిపి రెడ్డి, బోరా సుబ్రహ్మణ్యం, నగేష్, బేత శ్రీనివాసరావు, మాజేటి శ్రీనివాసరావు, ధనశ్రీ, మేడంకి వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు, గుడివాడ పట్టణ నాయకులు సిహెచ్ శివ నాగమల్లేశ్వరరావు, రేపాని కొండ, పి రజిని, లంక సురేంద్ర, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలకు పాల్పడిన నలుగురు అరెస్టు

• లక్షల విలువైన సొత్తు రికవరీ



చోరీ వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గన్నవరం : వేర్వేరు దొంగాతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుండి సుమారు 14 లక్షల రూ.లు విలువైన ఐదు మోటార్ సైకిళ్ళు, సుమారు 60 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాములు విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు గన్నవరం డిఎస్పి చలసాని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం గన్నవరంలోని డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దొంగల వివరాలను ఆయన వెల్లడించారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గత మే నెల 3 న పొట్టిపాడు గ్రామంలో రామాలయం వీధిలో గల బాణాల సుభాషిణి (60) అను మహిళ తన ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుఝామున సుమారు నాలుగున్నర గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ఆమె ఇంటిలోకి ప్రవేశించి, ఆమెపై దాడి చేసి, మెడలో గల సుమారు ఐదు కాసుల బంగారు నాన్ తాడుని, దొంగిలించుకు పోయినట్లు రిపోర్ట్ ఇవ్వగా ఆత్కూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. హనుమాన్ జంక్షన్ సీఐ కేవీఎన్ఎన్ సత్యనారాయణ నేతృత్వంలో ఒక ప్రత్యేక టీం ఏర్పరిచి నిందితుల ఆచూకి కోసం గాలింపు చేపట్టినట్లు వివరించారు. ప్రత్యేక బందంగా ఏర్పడిన ఆత్కూరు పోలీస్ స్టేషన్ ఎస్సై చావా సురేష్ , సిబ్బంది అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఈ నేరానికి పాల్పడింది ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం శివారు వేగవరం కు చెందిన పారేపల్లి శేషు (23), పోలవరపు నాగ దుర్గాప్రసాద్, దుగ్గిరాల శివరామకష్ణలు గా గుర్తించి వారి కోసం గాలింపు చేపట్టారు. ప్రధాన ముద్దాయి అయిన పారేపల్లి శేషుని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి, చోరి చేసిన ఐదు కాసుల బంగారు గొలుసుతో పాటు, ఒక మోటార్ సైకిల ్ని స్వాధీనం చేసుకున్న ట్లు తెలిపారు. ఆ మోటార్ సైకిల్ కూడా చోరీ చేసినదేనని నిర్ధారణ అవడంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్ట్ లో హాజరు పరిచారని చెప్పారు.



రికవరీ చేసుకున్న సొత్తు

మరో ముగ్గురి నేరస్తుల అరెస్ట్

ఏలూరుకు చెందిన దత్తి నవీన్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంకు చెందిన గుత్తుల రవికుమార్, సాయి, శ్రీరామ్ అనే ముగ్గురు బృందంగా ఏర్పడి వరుస చోరీలకు పాల్పడగా చోరీ చేసిన ఒక మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తుండగా పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద ఆత్కూరు ఎస్సై, సిబ్బంది కలసి అదుపు లోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ మద్య కాలంలో తాము ఒక నాలుగు మోటార్ సైకిళ్ళ దొంగతనానికి పాల్పడమే కాక, ఒక నాలుగు తాళం వేసి ఉన్న ఇళ్ళల్లో కూడా నేరాలకు పాల్పడి బంగారు వెండి వస్తువులు దొంగిలించినట్టు చెప్పారన్నారు. నిందితులందరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచుగా మేజిస్ట్రేట్ గాయత్రి రిమాండ్ విధించారని చెప్పారు.



అనుమానాస్పదస్థితిలో ట్రాక్టర్‌డ్రైవర్ మృతి



వెంకటరావు మృతదేహం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని పసుబోట్ల పాలెంలో ట్రాక్టర్ డ్రైవర్ రేమల్లి వెంకట్రావు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆ గ్రామంలోని రోడ్డు పక్కన గాయా లతో వెంకటరావు విగతజీవిగా పడి ఉండడాన్ని గుర్తించిన గ్రామ స్తులు పోలీసులకు సమాచారం అందించారు. తాను డ్రైవర్గా పనిచేస్తున్న ట్రాక్టర్ యజమానితో సోమవారం రాత్రి మద్యం మత్తులో వెంకట్రావు గొడవపడ్డాడని, హత్యకు గొడవే కారణ కావచ్చని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న గుడ్లవల్లేరు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ఆధారాలు చేపట్టే పనిలో ఉండగా, గుడివాడ డిఎస్పీ ధీరజ్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా హాస్పిటల్ కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు, ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ తెలిపారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, విద్యుత్ శాఖ అధికారులు

సోలార్ విద్యుత్ వినియోగం పెరగాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : సోలార్ విద్యుత్ వినియోగం మరింత పెరగాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం అవనిగడ్డలోని ఆయన కార్యాల యంలో పీఎం సూర్యఘర్ కరపత్రాన్ని విద్యుత్ శాఖ అధికారుల తో కలసి ఆవిష్కరించారు. సబ్ డివిజన్ పరిధిలో 100 ఇళ్లకు సోలార్ విద్యుత్తు లక్ష్యం సాధించిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం సోలార్ విద్యుత్ వినియోగం పెంచేందుకు అందిస్తున్న సబ్సిడీ సద్వినియోగం చేసుకొని ప్రజలు తక్కువ ఖర్చుతో విద్యుత్ పొందాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ గురించి గ్రామాల్లో ప్రతి ఒక్కరికి తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ ఎన్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ ఎస్ వి వి సత్యనారాయణ విద్యుత్ శాఖ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

• రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాల రమేష్



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదు సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ సంక్షేమం కోసం రాష్ట్ర ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఫోటోగ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాల రమేష్ అన్నారు. మంగళవారం మచిలీపట్నం ఈడేపల్లిలో మచిలీపట్నం డివిజన్ ఫోటోగ్రాఫర్లు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సెమినార్ కు మాదాల రమేష్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఫోటోగ్రఫీలో అనేక మార్పులు వచ్చినాయి అని, ప్రభుత్వ పరంగా కూడా స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అర్హులైన ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వ పరంగా కెమెరాలు స్టూడియోలు కొరకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని వద్ధ ఫోటోగ్రాఫర్లకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ టెక్నాలజీతో పోటీపడి ఫోటోగ్రాఫర్లు నైపుణ్యాన్ని పెంచుకోవాలని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో కెనాన్ కెమెరా కంపెనీ ప్రతినిధి వరుణ్ మచిలీపట్నం డివిజన్ ఫోటోగ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలంకుర్తి శేషు, కార్యదర్శి వంక అనంత కుమార్, కోశాధికారి మట్ట శ్రీరామ్‌తో పాటు మచిలీపట్నం గుడివాడ చల్లపల్లి అవనిగడ్డ పామర్రు కు చెందిన ఫోటోగ్రాఫర్లు ఈ సెమినార్ లో పాల్గొన్నారు.



అదానీ కంపెనీ ఏజెంట్లను అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు అడ్డగింత

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడలోని ధనియాల పేటలో మంగళవారం సాయంత్రం గహ వినియోగదారులకు స్మార్టు మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తున్న అదానీ ఏజెంట్లను స్థానికులతో కలసి సిపిఎం నాయకులు నివారించారు. ఇలా బలవంతంగా, స్మార్టు మీటర్లు బిగిస్తే పగులగొడతామని సిపిఎం నేతలు హెచ్చరించారు. చేసేదేమీ లేక అదానీ కంపెనీ ఏజెంట్లు స్మార్ట్ మీటర్లతో వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ సి పి రెడ్డి, గంగాధర్, కల్లం వెంకటేశ్వరరావు, బోరా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణప్రసాద్ మరణం తీరనిలోటు



కృష్ణ ప్రసాద్ (ఫైల్)

ప్రజాశక్తి-ఉంగుటూరు : కృష్ణ ప్రసాద్ (చిన్ని) మరణం గ్రామాభివృద్ధికి తీరనిలోటని స్థానిక శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దే రామ్మోహన్ రావు, గన్నవరం మాజీ శాసనసభ్యులు దాసరి వెంకట బాలవర్ధన రావులు అన్నారు. మండలంలోని కొయ్యగూరం పాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ కొరివి మాధవి భర్త కృష్ణప్రసాద్ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ గ్రామాన్ని అభివద్ధి చేయడంలో చిన్ని పాత్ర చాలా కీలకమైందని అన్నారు. గ్రామంలో మండలంలో పార్టీ అభివద్ధికి కృషి చేశారనీ, ఆయన లేని లోటు గ్రామానికి, పార్టీ కి కూడా తీరనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి లక్ష్మణస్వామి, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కొరివి పార్థ సారది, గోపిచంద్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు టిడిపి నాయకులు, కార్యకర్తలు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ క్యాంపస్ సమీపంలో 1కోటి 50 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న వంతెన పనులకు గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజ హితం కోసం పనిచేస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ఈ ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం కూటమి నాయకులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న యార్లగడ్డ

కూరపాటి కృష్ణమూర్తికి నివాళి

ప్రజాశక్తి-మొవ్వ : సిపిఎం మొవ్వ, సభ్యులు కూరపాటి కృష్ణమూర్తి అనారోగ్యంతో మంగళవారం ఉదయం వేములమడ గ్రామంలో తన స్వగహంలో మృతిచెందారు. ఆయన అవనిగడ్డ, ఉయ్యూరులో ఆర్టీసీ కండక్టర్ గా పనిచేశారు. కృష్ణమూర్తి విద్యార్థి దశ నుండి ఎస్ఎఫ్ఐలో తర్వాత సిపిఎంలో సభ్యులుగా ఉంటూ ఆర్టీసీ యూనియన్‌లో ఎంతో చురుకుగా పనిచేసేవారు. గ్రామాంలో కొంతకాలం వైస్ ప్రెసిడెంట్ గా ఉన్నారు. కూరపాటి కృష్ణమూర్తి చివరి వరకు సిపిఎం జెండాని మాత్రం వదలలేదు. నిడుమోలు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పాటూరు రామయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శీలం నారాయ ణరావు, జిల్లా కమిటీ సభ్యులు యద్దనపూడి మధు, ఘంటసాల మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, మొవ్వ మండల కమిటీ సభ్యులు కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు, ఉప్పలపు వెంకటాద్రి, సీనియర్ సభ్యులు మద్దుల బసవయ్య, గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు, ఆర్ మురహరి రెడ్డి, పార్టీ సభ్యులు మద్దుల బసవరావు, ఉప్పలపు వెంకటాద్రి, సిఐటియు జిల్లా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ కరీముల్లా, కొడాలి కరుణాకర్, కౌలు రైతు సంఘం నాయకులు వడ్డే వెంకటేశ్వరరావు, తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.





న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది జెట్టి ప్రణీత్ కుమార్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ 'న్యాయవాదుల రక్షణ చట్టం' అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇ.వి.జగన్నాథరావు, వై.ధనుంజయుడు, రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, జి శ్రీనివాస్ గౌడ్, దాసరి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

'మా బడిని మా ఊర్లోనే ఉంచండి'

ప్రజాశక్తి - మైలవరం : మా బడిని మా ఊర్లోనే ఉంచండి అంటూ అధికారులను వేడుకుంటున్నారు. మండలంలోని లక్ష్మీ నరసాపురం (కొత్తగూడెం) గ్రామస్తులు లక్ష్మీ నరసాపురంలో ఎలిమెంటరీ పాఠశాల ఉంది. ప్రస్తుతం 1,2 తరగతులు కొనసాగుతున్నాయి. పిల్లలు తక్కువగా ఉండటంతో ఒక ఉపాధ్యాయిని ఉన్నారు. పిల్లలు తక్కువగా ఉన్నారని ఉద్దేశంతో చిలుకూరు వారి గూడెం జడ్పీ హైస్కూల్ సమీపంలోని ఉన్న మరొక పాఠశాలలో విలీనం చేస్తున్నారని ఉద్దేశంతో గ్రామస్తులు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగా తమ సమస్యను అధికారులకు విన్నవించారు. లక్ష్మీ నరసాపురం నుండి హైవే పక్కన ఉన్న పాఠశాలకు పిల్లలు వెళ్లాలంటే భయంగా ఉందని తల్లిదండ్రులు వాపోయారు. హైవే పక్కన ఇటీవల వారానికి ఒకటి యాక్సిడెంట్ అయ్యి చనిపోతున్నారని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం అధికారులకు అర్జీ ఇచ్చి వెళ్లారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపిపి లక్ష్మీ ప్రసన్న రాణి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అనురాధ ఇతర శాఖల అధికారులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

విజయవాడ : విజయవాడ గాంధీనగర్ బావాజీపేటలోని నవజీవన్ బాల భవన్‌లో హెచ్ఐ వి/ఎయిడ్స్ బాధితులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఆహార తయారీపై డెమో/ అవగాహన కల్పించారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జూపూడి ఉషారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంతో ఉండాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలతో ఆహార పదార్థాలను తయారు చేసుకోవాలని సూచించారు. మన శరీరానికి కావలసిన న్యూట్రిషన్ అన్ని ఈ ఆహారపదార్థాలతో ఉన్నాయని మానసికంగా ధైర్యం కలిగి ఉండాలని చెప్పారు. మందుల్ని కూడా నిర్ణీత సమయానికి వేసుకోవాలని, ఇలాంటి పౌష్టికాహారం ప్రతి రోజు తీసుకోవాలని అన్నారు. నవజీవన్ బాల భవన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఫాదర్ అంతయ్య మాట్లాడుతూ అనారోగ్య బాధిత కుటుంబాలకు ప్రతి నెలా పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహనా, కుటుంబాలలో ఉన్న బాల బాలికలకు విద్యార్థులకు చదువుకు సహాయం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శాంసన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యం చాలా ముఖ్యమని ప్రతి ఒక్కరు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఏ.ఆర్.టి మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ మర్రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు, జోనల్ కోఆర్డినేటర్స్ జాకబ్ రాజు, నజ్మా, ప్రియాంక, దేవమణి, వెంకటేశ్వరావు, రమేష్, జ్యోతిచంద్రిక, వాలంటీర్స్ హైమావతి, దుర్గా, రాణి, హెచ్ఐవి బాధితులు పాల్గొన్నారు.


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యోగా దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 21న జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించే యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లును మంగళవారం జగ్గయ్యపేట పట్టణ మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు సిబ్బంది, పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

మునకుళ్ల, అక్కపాలెంలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - తిరువూరు : వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం సబ్సిడీపై కిసాన్ డ్రోన్స్ అందుబాటులో ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.కెనడీ పేర్కొన్నారు. తిరువూరు మండలంలోని మునకుళ్ళ, అక్కపాలెం గ్రామంలో మంగళవారం ఆయన ఏఒ పద్మతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కపాలెం గ్రామంలో సర్పంచ్ రవి కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కెనడి మాట్లాడుతూ కిసాన్ డ్రోన్స్ కావలసిన రైతులు ఐదుగురు గ్రూపుగా ఏర్పడి డ్రోన్ తీసుకోవచ్చన్నారు. జాతీయ ఆహార, పోషక భద్రతా మిషన్ పథకం (నేషనల్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ మిషన్ ద్వారా నూతన వంగడాల యొక్క విత్తన లభ్యత కోసం ఎంటీయూ 1224 ఫౌండేషన్ వరి విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు ఇస్తున్నట్లు చెప్పారు. రైతులు సొంతంగా తమ విత్తనాలను తాము పండించుకుని తోటి రైతులకు కూడా నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడమే ఈ పథకం ఉద్దేశ్యమన్నారు. పశు వైద్యులు అభిలాష్ పశుసంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై ఉన్న గడ్డి విత్తనాలు, పశువులకు వేసే టీకాలు, క్యాటిల్ షెడ్ పథకాల గురించి వివరించారు. బీజామృతం తయారీ ఉపయోగాలు ప్రకృతి వ్యవసాయ విభాగం లక్ష్మీపురం యూనిట్ ఇన్‌ఛార్జ్ ఎం.సతీష్ వివరించారు. బీజామృతంను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.శ్వేత, ఎహెచ్.ఎ.వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

తల్లికి వందనం గ్రీవెన్స్ 30 వరకు కొనసాగించాలి: సిపిఎం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : తల్లికి వందనం పథకం గ్రీవెన్స్ సమయాన్ని ఈ నెల 30 వరకు సచివాలయాలలో సాగించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తన డివిజన్ పరిధిలోని 170, 777 సచివాలయాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో తల్లికి వందనం గ్రీవెన్స్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రతి సచివాలయం పరిధిలో 100 నుంచి 200 మందిదాక అర్హులైన లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం నగదు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని లబ్ధిదారులు సత్యబాబు దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వం తప్పుడు నిబంధనలతో సంక్షేమ పథకాలలో కోతకోసిందని, ఆ నిబంధనలను ఎత్తివేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమినేతలు, తీరా అధికారంలోకి వచ్చాక ఆ నిబంధనలనే కొనసాగిస్తూ సంక్షేమ పథకాలకు కోతలు పెట్టడం సమంజసం కాదన్నారు. తల్లికి వందనం పథకానికి మరొకసారి దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువును 20తో ముగించకుండా 30 వరకు పొడిగించాలని కోరుతున్నామన్నారు. ఈ పర్యటనలో స్థానిక సిపిఎం నాయకులు ఎ.శ్రీను, జి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న సత్యబాబు

తల్లికి వందనం పథకం ప్రతి ఒక్కరికీ అమలు చేయాలి : ఎస్ఎఫ్ఐ

కంచికచర్ల : తల్లికి వందనం పథకాన్ని ప్రతి విద్యార్థికి ఆమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనల పేరుతో తల్లికి వందనం పథకంలో విద్యార్థుల సంఖ్యను కుదించటం దారుణమన్నారు. తల్లికి వందనం పథకం ప్రతి విద్యార్థికి ఆమలు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి తల్లికి వందనం పథకం బురిడి కొట్టించి తల్లిదండ్రులను మోసం చేశారన్నారు. ఎన్నికల హామీకి అనుగుణంగా రూ.15వేలు చొప్పున ఇవ్వాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు షేక్ ఖజు, తులసి, వరలక్ష్మి, దీపిక, నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

సై-టీబీ వ్యాక్సినేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కొత్తపేట షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివప్రసాద్ సై - టీబి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. టీబి వ్యాధి నివారణ కింద ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సై - టీబి వ్యాక్సిన్ తీసుకుంటే టీబి వ్యాధిని నియంత్రించవచ్చని శివప్రసాద్ తెలిపారు. ఈ వ్యాక్సిన్ సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. టిబి వ్యాధిగ్రస్తునితో పాటు వారి కుటుంబసభ్యులు సకాలంలో సై -టీబి వ్యాక్సినేషన్ తీసుకుంటే ఈ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు టీబి వ్యాధి సోకకుండా ముందస్తు నిర్ధారణ పరీక్షలు జరిపి ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ హాస్పిటల్ టిబి విభాగం ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు సై- టీబి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది తోపాటు టీబి యూనిట్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.



'కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై, ఘన కార్యాలను, వైసిపి ప్రచురించిన జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైసీపీ మండల అధ్యక్షులు బూడిద నరసింహారావు, గూత్తా శంకర్రావు, రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర బీసి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా చంద్రబాబు చేస్తున్న మోసాలు, అరాచకాలను వివరిస్తూ పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు మేనిఫెస్టోను పక్కాగా అమలు చేశారన్నారు. ఈ పుస్తకాన్ని మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు చేరవేసి ప్రజల్ని చైతన్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లిని అభివృద్ధిపథంలో నడపాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం సమిష్టిగా సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పథంలో తీర్చిదిద్దాలని టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లకు సూచించారు. కొండపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడిన సందర్భంగా ఎన్నికైన ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్మన్‌లు కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాస్‌ను తన కార్యాలయంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేయాలని తెలిపారు.

సిద్ధార్థ ఆధ్వర్యంలో యోగా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాల, అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుమల తిరుపతి దేవస్థానాలు సంయుక్తంగా సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ సన్నాహక యోగోత్సవంలో 151 మంది పాల్గొన్నారు. వారు ఉదయం 6 గంటల నుంచి గంట పాటు వివిధ యోగాసనాలు వేశారు.

అతిసార ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి - తిరువూరు : చిన్న పిల్లల్లో సీజనల్‌గా వచ్చే అతిసార వ్యాధి బారిన పడకుండా నివారణ చర్యలపై తిరువూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని వైద్యాధికారిణి డాక్టర్ రేష్మా బేగం మంగళవారం నిర్వహించారు. పిల్లలు అతిసార వ్యాధి బారిన పడకుండా తరచూ సురక్షిత మంచినీరు తాగిస్తూ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. చిన్నారులు తల్లిపాలు తాగకపోవడం, వాంతులు, నీళ్ల విరేచనాలతో అనారోగ్యానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని చెప్పారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలున్న ప్రతి ఇంట్లో తప్ప నిసరిగా ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒఆర్ఎస్ ద్రావణం తయారీ విధానం కూడా తల్లిదండ్రులకు నేర్పించాలని రేష్మా బేగం సిబ్బందికి సూచించారు. అనంతరం అతిసార వ్యాధి గురించి వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను వైద్యాధికారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కె.రవి, హెల్త్ విజిటర్ ఎస్కె ఆషా బి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గండ్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ మార్తి నరేష్ అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను 88 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాకమిటీ ఛైర్మన్ నరేష్ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి మిత్ర కిట్లు ద్వారా విద్యార్థులకు సమగ్రమైన నాణ్యమైన విద్య అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం అని కొండపల్లి మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ప్రభుత్వం అందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.హేమలత, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవ ఉమామహేశ్వర రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న విసి కె. రాంజీ

ఆహార నియమాలతో ఆయుష్షు

- కెయు ఉపకులపతి ఆచార్య రాంజీ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ఆహార నియమాలతోనే ఆయుష్షు పెరుగుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ సూచించారు. విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్యం - పౌష్టికాహారం అనే అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె రాంజీ మాట్లాడుతూ పాశ్చాత్య నాగరికతను ఒంట బట్టించుకుంటున్న నేటి యువత ఆహారపు అలవాట్లు మార్చుకోవడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కనే అవకాశం ఉందని అన్నారు. రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు మాట్లాడుతూ మన పూర్వీకులు ఏ ఆహారపు అలవాట్లు పాటించారో ఆ పద్ధతిని అనుసరించడం తప్పనిసరి అని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో చూసి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం మంచిది కాదని స్పష్టం చేశారు. న్యూట్రిషన్ స్పెషలిస్ట్ బి విద్యాసాగర్ ఆహారపు ప్రస్తుత ఆహారపు అలవాట్ల, వాటి వల్ల ఒనగురుతున్న నష్టాల్ని సోదాహరణంగా వివరించారు. ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్. ఎం శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్థిక గణాంకాధికారి రతన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, అధికారులు డా. శేషారెడ్డి పాల్గొన్నారు.



బండి రామకృష్ణకు అభినందనలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జిగా పార్టీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి కృష్ణాజిల్లా సహకార కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ డీసీఎంఎస్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న శుభ సందర్భంగా మంగళవారం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు బండి రామకృష్ణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం మచిలీపట్నం సత్యా కన్వెన్షన్ నందు పదవి బాధ్యత స్వీకార అభినందన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కంకిపాడు : జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకరిస్తామని, జిల్లాను పారిశ్రామికంగా అగ్ర పదంలో నిలిపేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకొని పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పెనమలూరు మండలం తాడిగడప వందడుగుల రోడ్డు లోని అన్నే కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాల సహకారం అందించి ప్రోత్సహిస్తామన్నారు. పారిశ్రామికవేత్తలకు జిల్లాస్థాయిలో ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరించి త్వరితగతిన అనుమతులు మంజూరు అయ్యేలా కషి చేస్తామన్నారు. అదే రాష్ట్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని ప్రభుత్వం దష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు అన్ని విధాల కషి చేస్తామన్నారు. రుణాల రీ షెడ్యూల్ ఎవరికైనా అవసరం అయితే జిల్లా జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాల సాయం చేస్తామని అన్నారు. ఒక పరిశ్రమ రావాలంటే మామూలు విషయం కాదని వచ్చాక కూడా అది నిలదొక్కుకొని ముందుకు సాగాలంటే చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్ హేళ షారూన్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి భాస్కరరావు, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ చైర్ పర్సన్ వి నాగలక్ష్మి, అధినేత శ్రీనివాస సతీష్,పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెనిగండ్ల రాము

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పిపబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4), ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్-బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్ష నిర్వహించారు. గుడివాడ పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో ఆర్డిఓ బాలసుబ్రమణ్యంతో కలిసి అధికార యంత్రాంగంతో ఎమ్మెల్యే రాము మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవడం సహా సాయం చేయడం ద్వారా పేదరిక నిర్మూలనే ఈ పథకం లక్ష్యమని ఆ దిశగా మనందరం ముందుకు సాగుదామని అధికార యంత్రాంగంతో చెప్పారు. పి-4 విధానం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత ఉన్న కుటుంబాలను గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఉన్న సమాచారం, హౌస్‌హోల్డ్ సర్వే, గ్రామసభల ధ్రువీకరణ ద్వారా గుర్తిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పి-4 పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన గుడ్లవల్లేరు మండలంలోనీ కుచికాయలపూడి గ్రామంలో ఇటీవల నిర్వహించిన సర్వే వివరాలను ఎమ్మెల్యే రాముకు అధికారులు వివరించారు. గ్రామంలోని 100 కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు మెగా సంస్థ ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గుడివాడ అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాస్, తాసిల్దార్లు లోకరాజు, కిరణ్, గురుమూర్తి రెడ్డి, ఎంపీడీవోలు విష్ణు ప్రసాద్, సారథి, నాగ మల్లేశ్వరి పాల్గొన్నారు.

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలికి స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ న్యూఢిల్లీ నుండి మంగళవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమెకు కష్ణాజిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం ఎన్ రాణి ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.




సమాజ సేవలో మేటి మొగలేశ్వర గుప్తా

ప్రజాశక్తి-మోపిదేవి : సమాజంలో వ్యాపార రంగంలో రాణిస్తూ ఏదైనా సమస్యలతో ఇబ్బంది పడేవాళ్లు, కష్టాల్లో ఉన్న వాళ్లను ఆదుకోవడంలో విశ్వం శెట్టి మొగలేశ్వర గుప్తా ముందు వరుసలో ఉంటారని పలువురు అంటున్నారు. మోపిదేవి మండల కేంద్రంగా కిరణా వ్యాపారంతో మొదలుపెట్టిన ఆయన ప్రస్థానం అంచెలంచెలుగా ఎదుగుతూ ఆర్యవైశ్య సంఘంలో అనేక పదవులను నిర్వహించారు. తల్లిదండ్రులు రామకృష్ణ, గజలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం మోపిదేవిలో ఇటీవల రామకష్ణ గ్రాండ్ భక్తులు వసతి సముదాయం ప్రారంభించి నామమాత్రపు ధరలకే విడిది సౌకర్యం కల్పిస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడ ఏ ప్రమాదం జరిగి ఇబ్బందులు పాలైన కుటుంబాలను ఆదుకోవడంలో విశ్వంశెట్టి మొగలేశ్వర గుప్తా శక్తి వంచన లేకుండా తన వంతు సహాయం అందిస్తున్నారని పలువురు అంటున్నారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన వారికి నిత్యావసర సరుకులు బియ్యం, దుస్తులు అందిస్తారని, కరోనా విపత్కర పరిస్థితుల్లో చల్లపల్లి, మోపిదేవి ప్రాంతాల్లో రోజుకు 150 మంది శ్రామికులకు ఉచిత ఆహార పొట్లాలు పంపిణీ చేశారని అన్నారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభమైన సీజన్లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, బిస్కెట్లు విరివిగా అందించే కార్యక్రమాలు చేపట్టి నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రుల మనసులో స్థానం సంపాదించారు.



మొగలేశ్వర గుప్తా తన చేపట్టిన సేవా కార్యక్రమాలపై ప్రజాశక్తితో మాట్లాడుతూ కిరణ వ్యాపారం అనంతరం తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన బెల్లం కొట్టు నిర్వహణ బాధ్యతలు చేపట్టి ఏటా వచ్చే లాభాలలో 10 నుంచి 20 శాతం వివిధ సేవా కార్యక్రమాలకు ఖర్చు పెట్టాలని భావించినట్లు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో సామాజికంగా ప్రజల ఇబ్బందులు, విపత్కర పరిస్థితిని బట్టి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానసికంగా తప్తినిస్తుందని ఆయన అన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాలుపంచుకుంటున్న విశ్వం శెట్టి మొగలేశ్వర గుప్తా 2022 జనవరిలో హ్యూమన్ రైట్స్ మిషన్ కష్ణాజిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్గా 2021లో 2023లో వరుసగా రెండు పర్యాయాలు బాధ్యతలు చేపట్టారు. 2024లో కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. తాజాగా 2025 జనవరిలో కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా నియమించబడ్డారు. వత్తి ధర్మంగా వ్యాపారం చేస్తూ సంపాదించిన దానిలో కొంత మొత్తం కష్టాలలో ఉన్న వారి కోసం ఖర్చు పెట్టే అవకాశాన్ని తాను అదృష్టంగా భావిస్తానని మొగిలేశ్వర గుప్తా పేర్కొన్నారు 1965లో జన్మించిన మొగలేశ్వర గుప్తా తన 60 ఏళ్ల ప్రస్థానంలో సామాజిక సేవ చేయడం ద్వారా వచ్చిన తృప్తి అనిర్వచనీయమైందన్నారు.

యలమంచిలి సేవలు స్ఫూర్తిదాయకం



ప్రజాశక్తి-కంకిపాడు : నందమూరి తారక రామారావు స్ఫూర్తితో అను నిత్యం సామజిక సేవలో ఉంటున్న యలమంచిలి కిషోర్ బాబుకు ప్రదానం చేస్తున్న ఎన్టీఆర్ సేవారత్న పురస్కారానికి అన్ని విధాల అర్హుడని రాష్ట్ర ఎంపిటిసిల సంఘం మాజీ అధ్యక్షులు కాసరనేని మురళి అన్నారు. యలమంచిలి ఎన్టీఆర్ సేవారత్న పురస్కారానికి ఎంపిక యిన సందర్భాన్ని మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, కేవలం సామజిక సమస్యల పరిష్కారానికి మాత్రమే పరిమితం కాకుండా కంకిపాడు ప్రభుత్వాసుపత్రి చైర్మన్‌గా సామాన్య ప్రజలకు అత్యుత్తమ సేవలు లభించేలా చేయడంతో పాటు ఆసుపత్రి అభివద్ధి కోసం ఎంతో కషి చేశారని అన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పలు ఉపకరణాల వితరణ వంటి ఎన్నో దాతత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు కోటా జోజిబాబు,మోరం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పునర్ వ్యవస్థీకరించాలి



ప్రజాశక్తి-గన్నవరం : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ సూచనలతో మంగళవారం గన్నవరం తహశీల్దారు కార్యాలయంలో గన్నవరం మండల తహశీల్దారు కె.వి. శివయ్య అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి ఓటర్ల తాజా పరిస్థితి, పోలింగ్ బూత్ ల వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా కె.వి. శివయ్య మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో నేటికీ నాలుగు మండలాల్లో 2,79,994 మంది ఓటర్లుగా నమోదయ్యారని, విజయవాడ రూరల్ మండలంలో 89,315 మంది, గన్నవరం మండలంలో 74,678 మంది, బాపులపాడు మండలంలో 72,088 మంది, ఉంగుటూరు మండలంలో 43,913 మంది ఓటర్లుగా నమోదయ్యారని అన్నారు.సమావేశంలో గన్నవరం నియోజకవర్గ టి.డి.పి. పోల్ మేనేజ్ మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ళ వెంకట గోపాకష్ణారావు మాట్లాడుతూ నియోజక వర్గంలోని మొత్తం 4 మండలాల్లో ప్రస్తుతం వున్న 307 పోలింగ్ స్టేషన్లలో 41 పోలింగ్ బూత్లలో 1200 ఓటర్లు మించి వున్నారని అన్నారు. తాజాగా భారత ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల ప్రకారం వీటిని పునర్వ్యవస్థీకరించి రెండు పోలింగ్ స్టేషన్లుగా విడగొట్టాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు చిమటా రవివర్మ (జనసేన), తంగిరాల శ్రీనివా సరావు (టిడిపి), నాదెండ్ల మోహన్ (బి.జె.పి.), డిటి లక్ష్మినాంచారమ్మ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు విద్యుత్ మరమ్మతులు

ప్రజాశక్తి-మోపిదేవి : హై టెన్షన్ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఈనెల 18వ తేదీ బుధవారం నుంచీ 30వ తేదీ వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కష్ణానాయక్, చల్లపల్లి డీఈ పులి శివనాగేశ్వరరావులు తెలిపారు. 220 కేవీ నున్న - గుడివాడ ట్రాన్స్ మిషన్ లైన్ ఆధునీకరణలో సాంకేతిక మరమ్మతులు చేయాల్సి ఉందనీ, ప్రతిరోజు ఉదయం ఏడు గంటల నుంచీ సాయంత్రం ఆరు గంటల వరకు పనులు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఇందుకోసం గుడివాడ 220 కేవీ ఉపకేంద్రంలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందనీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే గుడివాడ 200 కేవీ ఉపకేంద్రం, పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట 132 కేవీ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాలో కొంత సమయం అంతరాయం ఏర్పడుతుందనీ, ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

9న సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం బిఆర్‌టిఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు సిఐటియు కార్యాలయంలో విస్తృత సమావేశం జరిగింది. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు మాట్లాడుతూ వచ్చే నెల దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను ట్రాన్స్‌పోర్టు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను హరించేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ సిఐటియు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె.దుర్గావళి, నగర నాయకులు డి.కోటయ్య జె.సూర్యనారాయణ విజయ భాస్కర్ రమణబాబు ఎ.వి రెడ్డి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.




ఇబ్రహీంపట్నంలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం : లేబర్ కోడ్స్ రద్దు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు కొండపల్లి సిపిసి యాజమాన్యానికి సిఐటియు నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. సమ్మె నోటీసును సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్, సిపిసి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.కాంతారావు, జి.సాంబశివరావు, కోశాధికారి కె.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు జి.పరమయ్య అందజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరులపాడు : మండలం చట్టన్నవరం గ్రామంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు సాహితీ, నమ్రత పాల్గొని కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేశారు. శుక్లాలు, పొరలు ఉన్న వారిని ఆపరేషన్ నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లనున్నట్లు ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గారావు తెలిపారు. చట్టన్నవరం సిఎస్ఐ ఎలిమెంటరీ స్కూల్ ఏరియాలో నిర్వహించిన ఈ క్యాంప్‌లో సుమారు 82 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 12 మందికి కంటి ఆపరేషన్‌లు చేయాల్సి ఉందని, డాక్టర్లు నిర్ధారణ చేసినట్లు పిఆర్‌ఒ రాఘవ తెలిపారు. కంటి ఆపరేషన్‌లు చేయాల్సి వారిని ఇదే రోజు బస్‌లో కంటి ఆపరేషన్ చేయటానికి తీసుకొని వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైతుకు ప్రశంసా పత్రం



ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలం మక్కపేట గ్రామానికి చెందిన రైతు కొండబోలు నాగేశ్వర రావు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సీడ్స్ వర్క్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమి టెడ్‌లో యూఎస్ సీడ్స్‌తో అడుగులు వేస్తూ 2002 యు ఎస్4708 హైబ్రిడ్ పత్తి స్టాగులు అధిక దిగుబడులు సాధించారు. ఎకరానికి 20 క్వింటాలుకు పైగా దిగుబడి వచ్చినట్లు ఆ రైతు తెలిపారు. ఆ సందర్భంగా కంపెనీ యాజమాన్యం గర్విస్తూ రైతు నాగేశ్వరరావుకు ప్రశంస పత్రాన్ని అందించింది. అందించిన వారిలో రీజనల్ మేనేజర్ ఎన్.సత్యనారాయణ, క్లస్టర్ లీడ్ దక్షిణ విభాగానికి చెందిన సిరా గోపి వెంకటేష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందించారు. మక్కపేట గ్రామంలో పలువురు రైతులు నాగేశ్వరరావును అభినందించారు.

విత్తనాల కోసం పడిగాపులు

ప్రజాశక్తి - మైలవరం : గ్రామస్థాయిలో ప్రజలందరికీ మెరుగైన సేవలు అందించాలని ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటయింది. అధికారులు సమయపాలన పాటించక పోవడంతో గ్రామ సచివాలయాలు వెలవెలబోతున్నాయి. వరి విత్తనాల కోసం వచ్చిన రైతులు పడిగాపులు పడాల్సి వస్తుంది. పుల్లూరు 2 సచివాలయంలో వివిధ హోదాలకు చెందిన పదిమంది వరకు పనిచేస్తున్నారు. వీరందరూ ఉదయం 10 గంటలకల్లా తమ విధులకు హాజరు కావాల్సి ఉంది. విద్య, సంక్షేమ అధికారి తప్ప అందరూ 11 గంటలు దాటిన తర్వాత తాపీగా సచివాలయానికి చేరుకుంటున్నారు. అప్పటికే రెండు గంటలకు పైగా వరి విత్తనాల కోసం, వచ్చిన రైతులు, రైతు సంఘం నాయకులు వ్యవసాయ సహాయ సంచాలకుల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు దేవి రెడ్డి భూపాల్ రెడ్డి మూడు రోజుల నుంచి విత్తనాలు అడుగుతుంటే గురువారం ఇస్తానని చెప్తున్నారని, తీరా వరి విత్తనాలను బడా నాయకులకు ముందుగానే ఇచ్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

అధికారులను నిలదీసిన రైతు సంఘ నాయకులు

అప్పటికే గంటల తరబడి ఉన్న రైతు సంఘం నాయకులు అధికారులను నిలదీశారు. సకాలంలో రైతులకు సేవలందించలేని ఉద్యోగస్తులు ఎందుకని రైతు సంఘం



సచివాలయం వద్ద వేచి ఉన్న రైతులు

మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు సిహెచ్.సుబ్బారెడ్డి ప్రశ్నించారు. ప్రతి ఒక్క రైతుకు వరి విత్తనాలను ఇవ్వాలని, ముందుగానే ఏ రోజు ఇచ్చేది రైతులకు సమాచారం తెలియజేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు ఇచ్చేటప్పుడు రసీదులు ఇవ్వటం లేదని అంతా హడావుడి గందరగోళంగా ఉందని, అన్నారు. రైతు భరోసా పథకం డబ్బులు జమ కావాలంటే ప్రతి ఒక్కరూ తంబు వేయాలని చెబుతున్నారని, మరి కొందరు అవసరం లేదని అంటున్నారని పనులు మానుకొని సచివాలయం చుట్టూ రైతులు తిరుగుతున్నారని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. అధికారులు సమయానికి వచ్చి ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం మాగల్లు గ్రామంలో ఖాసిం అండ్ ఖాసిం వృద్ధాశ్రమంలో నందిగామ మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వి.సత్య లక్ష్మి ప్రసన్న పాల్గొని మాట్లాడుతూ వృద్ధులను సొంత తల్లిదండ్రుల్లా కంటికి రెప్పలా చూసుకుంటూ, ఎంత భారమైనా వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్న వృద్ధాశ్రయం నిర్వాహకులు షేక్ కరీముల్లాను ప్రత్యేకంగా అభినందించారు. మెయింటినెన్స్ వెల్ఫేర్ సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రకారం వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన మండల సేవ మండల న్యాయ సేవాధికారి సంస్థకు ఒక అర్జీ పెట్టుకుంటే సమస్యను పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. అక్కడున్న పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతోషం వ్యక్తపరిచారు. వృద్ధులను పేరుపేరునా వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ లైబ్రేరియన్ షేక్ అజాద్, సీనియర్ న్యాయవాదులు మౌళేశ్వరరావు, యరగోర్ల రామారావు, ఆశ్రయం నిర్వాహకులు షేక్ కరీముల్లా వృద్ధులు పాల్గొన్నారు. అనంతరం జడ్జిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి అధికారులు విధిగా సహకరించాలని మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మలక్ బషీర్ కోరారు. కంచికచర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్ బషీర్ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ మలక్ బషీర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రజలకు సేవ చేసేందుకు ఉన్నాం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులందరూ అంచనాలు త్వరగా వేసి, అభివృద్ధికి అడ్డుపడకుండా సహకరించాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని, విజిలెన్స్ కమిటీ వేసి ఫీజులను నియంత్రించాలని, ఆర్టిఏ యాక్ట్ సమర్థవంతంగా అన్ని తరగతులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా గ్రూపులకు సంబంధించి వివో లను తక్షణ నియామకం చేయాలని జెడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపిపి బండి మల్లికార్జున రావు కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత 22 మంది వివోలను తొలగించారని, వారిని తిరిగి విధుల్లో చేర్చుకోవాలని కోర్టు ఆదేశాలిచ్చినా చేర్చుకోకపోవటమేమిటని ప్రశ్నించారు. జుజ్జూరు రోడ్డులోని జగనన్న కాలనీకి వెళ్లే మార్గం లేక అక్కడ కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. వర్షం కురిసినప్పుడు వరద నీరంతా రోడ్డుపైనే ప్రవహించడంతో బురద చేరి నడవడానికి వీలు లేకుండా పోతుందని, చెరువు నుంచి తరలిస్తున్న నల్ల మట్టి అంతా ఈ మార్గం గుండా ట్రాక్టర్లలో వెళ్లడంతో రోడ్డుపై నల్లమట్టి పడి బురద పేరుకుపోతుందని, తక్షణం జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 21 యోగా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎంపీడీవో బిఎం లక్ష్మీ కుమారి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి వెలగలేటి మాధవి, ఎంఇఒ బాలాజీ, ఏపీఓ రమాదేవి, హౌసింగ్ ఎఇ వెంకటేశ్వరరావు, మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జె.విశ్వనాథ్, ఏపీఎం శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

అన్నదాతలకు మొండిచేయి

అసైన్డ్ భూములకు వర్తించని అన్నదాత సుఖీభవ

లబోదిబోమంటున్న పేద రైతులు

ప్రజాశక్తి - తిరువూరు : అసైన్డు భూములు కలిగిన పేద రైతులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా చూపించటంతో వారంతా లబోదిబోమంటున్నారు. ఈ పథకం కోసం అసైన్డ్ భూములున్న రైతులు సచివాలయలకెళ్లి వేలి ముద్రలు వేయగా వారి పేరు మీద భూములున్నట్లు ఆన్‌లైన్లో చూపించటం లేదని, అసైన్డు భూములకు ఈ పథకం వర్తించదని, ప్రభుత్వమే రాష్ట్ర వ్యాప్తంగా నిలుపుదల చేసిందని రైతు సేవా కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు. ఇవే అసైన్డు భూములకు గత ప్రభుత్వం రైతులతో పాటు మాకు కూడా పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పేరుతో ఏటా రూ.13,500 ఖాతాల్లో జమచేస్తే కూటమి ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకానికి తాము ఎందుకు అర్హులు కామని పేద రైతులు ప్రశ్నిస్తున్నారు. అన్నదాత సుఖీభవ



తహశీల్దార్ కార్యాలయంలో డిటికి వినతిపత్రం అందజేస్తున్న పేద మహిళ రైతులు

పథకానికి చిన్న, సన్నకారు రైతులు (5 ఎకరాల లోపు భూమి కలిగినవారు) మాత్రమే అర్హులుగా పేర్కొని భూమికి సంబంధించి పక్కాపత్రాలు, పట్టా లేదా పాస్‌బుక్ తప్పని సరిగా ఉండాలనే నిబంధన విధించింది.

అధికారులకు వినతి : అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలని తిరువూరు మండలం గానుగపాడు రెవెన్యూ పరిధిలోని జి.కొత్తూరు శివారు పల్లెర్లమూడి గ్రామానికి చెందిన పేద మహిళ రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లతో కలిసి కలిసి తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయంలో తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రి పై కొలువైన కనకదుర్గమ్మని జాతీయ మహిళా కమిషన్ మెంబర్ డాక్టర్ అర్చన మంజుందార్ దర్శించుకున్నారు. మంగళవారం ఇంద్ర కీలాద్రికి విచ్చేసిన మంజుందార్‌కు దేవస్థాన సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి చిత్రపటం ప్రసాదాలను అందింజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖాధికారిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండల వ్యవసాయ శాఖ అధికారిగా జి.సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం నుంచి బదిలీపై వత్సవాయి వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరిధిలో ఏ సమస్య వచ్చినా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

ఇజ్రాయెల్ దాడులపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ఐరాస సందేశాల్ని సైతం ఏమాత్రం ఖాతరు చేయని ఇజ్రాయెల్ అమానుష దాడుల్ని ఖండించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. పాలస్తీనా, ఇరాన్ దేశాలపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఖండిస్తూ వామపక్షాల పిలుపుమేరకు మండలంలోని నున్న గ్రామంలో మంగళ వారం ఉదయం ఆందోళన చేపట్టారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్ర మంలో మండల కార్యదర్శి ఎం.ఆంజ నేయులు, నాయకులు జి.వి.రంగారెడ్డి, జి.చినవెంకటరెడ్డి, సిహెచ్.రాంబాబు, ఎస్.బుజ్జి, ఎం.కోటేశ్వరరావు, సురేష్, అజయ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పనిచేయాలి

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండల ప్రజా పరిషత్‌లో అధ్యక్షులు ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆయన. మాట్లాడుతూ అన్ని శాఖ అధికారులు సమన్వయతో పనిచేయాలని గ్రామస్థాయి నుండి మండల స్థాయికి సమస్యలు రాకుండా అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని శాఖల పై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.శ్రీను, మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ గుంటుపల్లి శ్రీనివాసరావు (వాసు), ఆస్పిరేషనల్ బ్లాక్స్ కోర్డినేటర్ మోహన్ సందీప్, అన్ని శాఖల మండల అధికారులు, పాల్గొన్నారు.

నేడు వేదాద్రి ఆలయంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన మండలంలోని వేదాద్రి, బండిపాలెం గ్రామంలోని కౌలు భూములు '9' బిట్లుకు గానూ మొత్తం ఎ.46.89 సెంట్లుకు బుధవారం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ ఉన్నాతాధికారుల సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు.





గుంతలు పడిన రహదారి రహదారులు

గుంతల రహదారిలో ప్రయాణీకుల ఇక్కట్లు

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు దెబ్బతిని గుంతలుగా మారాయి. ప్రమాదకరంగా ఉన్న ఆ రోడ్లపై వాహనాలల్లో ప్రజలు ప్రయాణం కొనసాగిస్తూనే బిక్కుబిక్కు మంటూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ప్రయాణంలో సామాన్య ప్రజలే కాక గర్భిణీలు, బాలింతల అవస్థలు వర్ణనాతీతం. అత్యవసర పరిస్థితుల్లో గ్రామా ల్లోకి కనీసం 108 అంబులెన్స్ వాహనం వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఆ ప్రధాన రహదారులలోనే మోకాళ్ళలోతు గుంతలు వాటిని తప్పించే క్రమంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఇలపర్రు వద్ద లోడ్ తో వెళ్తున్న ఓ లారీ రోడ్డులో లోతుగా ఏర్పడిన గుంతలో పడడంతో ప్రమాదం జరిగే పరిస్థితి ఏర్పడిన సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ రహదారిలో ఎన్నో ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధాన రహదారులు మరమ్మతులు చేయాల్సిన అధికారులు, పాలకుల చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్లు అద్వానంగా తయారైతున్నాయని.. ప్రయాణికులకు, ప్రజలకు నరకం చూపిస్తున్నారని ఆవేదన చెందారు.

నేడు యోగా విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-విజయవాడ: యోగాంధ్ర 2025లో భాగంగా జిల్లాలో మూడు రోజుల పాటు వివిధ అంశాలలో యోగాసనాలపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి కళత్మాక యోగా పోటీలు అదరహెా.. అనిపించాయని, న్యాయ నిర్ణేతల సమక్షంలో పారదర్శకంగా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. అంతార్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర 2025లో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి చేసిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ బుధవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్విహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో యోగాసనాలకు సంబంధించి పలు అంశాలపై గ్రామ, మండల, పట్టణ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించి జిల్లా స్థాయిలో విజేతల్కైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్ నందు న్యాయ నిర్ణేతల సమక్షంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించి ఎంపిక చేయడం జరిగిందన్నారు. యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా ఫోటోగ్రాఫీ, యోగా స్లోగన్, వంటి అంశాలపై రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చామన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు 15 కేటగిరిలో జూనియర్, యంగ్, సీనియర్ గ్రూపులలో గెలుపొందిన విజేతలు మండల, జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి చేరుకున్నారన్నారు. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొంటారని అన్నారు.

యోగాతో నూతనోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: యోగాసనాలతో ప్రతి ఒక్కరూ నిత్య యవ్వనంతో నూతనోత్సహాన్ని పొందడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతారని యోగాసనాలను ప్రజలకు చేయాలన్నదే పభుత్వ ఉద్దేశమని, శతాబ్దాల క్రితం భారతదేశం యోగాసనాలకు కేంద్ర బిందువు అని తదనంతర కాలంలో కనుమరుగైన యోగాభ్యాసం "యోగాంధ్ర" పేరుతో తిరిగి పునరుజ్జీవింప చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగ మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా మంగళవారం బి ఆర్ టి ఎస్ రోడ్డులోని యోగా స్ట్రీట్ నందు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 202, వాకర్స్ క్లబ్, జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యోగాసనాల ద్వారా శరీరక మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపగలుగుతారన్నారు. రక్తపోటు, మధుమేహం, కండరాలు, మోకాళ్ల నొప్పులు, స్త్రీలకు సంబంధించిన రుగ్మతుల నుండి యోగాసనాల ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు. యోగాసనాలను ప్రజల జీవన శైలిలో ఒక భాగంగా చేసేందుకు యోగాంధ్ర కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. వాకర్ ఇంటర్నేషనల్ పూర్వపు గవర్నర్ టి. హనుమంతరావు మాట్లాడుతూ పతంజలి మహర్షి భారతదేశానికి అందించిన గొప్ప వరమే ఈ యోగ విద్య అన్నారు. జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి జె. శివ మాట్లాడుతూ యోగాసనాల ద్వారా లభించే మానసిక శక్తి మంచి ఆలోచనలకు దోహదపడుతుందన్నారు. మాసోత్సవా లలోనే కాకుండా యోగా స్ట్రీట్‌లో ప్రతి రోజు యోగాసనాలపై శిక్షణ ఇచ్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వేమూరి బాబురావు, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 202 పూర్వపు గవర్నర్ అమర్‌నాథ్, గవర్నర్ ఎ. విజయలక్ష్మీ, కార్యదర్శి పి. పుష్పలత, కోశాధికారి టి. బాలాజీ, జెసిఐ ప్రతినిధులు కె. రాజేంద్రరెడ్డి, కె. గణేష్‌బాబు, జె. స్వాతి తితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి ఎంజి రోడ్ లో ఉన్న జోయలుక్కాస్ షో రూమ్, మొగల్రాజపురం లో ఉన్న శారద ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ ను ఫైరాఫీసర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలనే దానిపై అధికారులు అవగాహన కల్పించారు. ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని కేసరపల్లి గ్రామంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కె. శివ ప్రసాద్ వివిధ వ్యవసాయ శాఖ పథకాలను గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన మిగిలిన రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు సుజాత, మీనా పాల్గొన్నారు. **ప్రజాశక్తి- ఘంటసాల :** రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను పరిచయం చేసి, లాభసాటిగా వ్యవసాయాన్ని మార్చేందుకు ప్రభుత్వం కషి చేస్తోందని మొవ్వ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు (ఏడీఏ) ఎస్. శ్యామల తెలిపారు. మంగళవారం ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, డీసీ వైస్ చైర్మన్ సుగ్గన రాంబాబు, కషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త వెంకటలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారిణి కీర్తి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండలం లోని పెద్ద ఆవటపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా జరిగిన సభలో మండల వ్యవసాయ శాఖాధికారి జి రమేష్ మాట్లాడుతూ సబ్సిడీ పై విత్తనాలు కావలసిన వారు మండల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉద్యాన వ్యవసాయ అధికారి చందు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం అయ్యంకిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి సురేష్ నాయక్ నారుమడులు, వెద పద్ధతిన సాగులో కలుపు యాజమాన్యం, భూమికి అనువైన వరి వంగడాల ఎంపిక, విత్తన శుద్ధి, పంట పొలాల్లో పైరుకు అవసరమైన రసాయనాలవినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాజులపాటి పార్వతి, విఎ ఏ రాజేష్ రైతులు పాల్గొన్నారు.



ఘంటసాల మండలంలో...



మొవ్వ మండలంలో...



'అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీ

ప్రజాశక్తి-ఉంగుటూరు : మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని పెద్దఆటపల్లి సర్పంచ్ బాణావతి తిరుపతమ్మ కోరారు. మంగళవారం మండలంలోని పెద్దఆవుటపల్లి గ్రామంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో తిరుపతమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడంతో పాటు విద్య, ఆట పాటలు నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బి పద్మాదేవి, వార్డు సభ్యులు కళ్యాణి, అంగన్వాడి వర్కర్స్ సాంబ, ఆయేషా పిల్లలు తల్లులు పాల్గొన్నారు.



యోగా దినోత్సవం


ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని అశ్వరావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య భారతి కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య భారతి కృష్ణా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, వైద్యులు డాక్టర్ వంగర శేషగిరిరావు పాల్గొని యోగా వలన ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఎస్‌టి వసూలుకు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు యాజమాన్య కార్యాలయాలు, విద్యాసంస్థల్లో తప్పనిసరిగా వస్తు సేవలు పన్ను (జీఎస్టీ) వత్తి పన్ను కచ్చితంగా వసూలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ ఐ.హేమతో కలిసి జిల్లా అధికారులతో వస్తు సేవల పన్ను, వత్తి పన్ను వసూలు పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాణిజ్య శాఖ వసూలు చేసే రెవెన్యూ ద్వారానే పౌరులకు సంక్షేమ అభివద్ధి పథకాలు అమలవడంతోపాటు ఉద్యోగులకు ప్రతినెలా జీతం వస్తుందన్నారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు సరిగా వసూలు కాక రావాల్సిన ఆదాయం తగ్గిపోతోందని, అధికారులు అందరూ కలిసికట్టుగా పనిచేసి వస్తు సేవల పన్ను, వత్తి పన్ను సక్రమంగా వసూలు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ఎగవేతదారుల జాబితాను వాణిజ్య పనుల శాఖ అధికారులు అందిస్తారని, ఆ జాబితా మేరకు జిల్లా వ్యాప్తంగా తహసీల్దారులు వారి పరిధిలో రెవెన్యూ వసూలు చట్టం(రెవెన్యూ రికవరీ ఆర్ యాక్ట్) ప్రకారం వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 177 ప్రభుత్వ శాఖలు ఉండగా కేవలం 84 శాఖలు మాత్రమే జిఎస్టి టిడిఎస్ ఫైలింగ్ జరుగుతుందని మిగిలిన 93 శాఖల్లో కూడా టిడిఎఫ్ ఫైలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏసిటీవో వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ.రమణ రావు, డి టి ఓ జి.మనీషా, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.

యాత్రికులకు అదనపు సౌకర్యాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సేవలను యాత్రికులకు మరింతగా అందుబాటులోకి తీసుకు రానున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి వికె శీనా నాయక్ వెల్లడించారు. ఈ మేరకు కనక దుర్గమ్మ ఆర్జిత సేవల బుకింగ్, విరాళాలు చెల్లింపులు, ఇతర సమాచారం కోసం విజయవాడ రైల్వేస్టేషన్, బస్టాండ్, వన్‌టౌన్‌లోని తారాపేట మాడపాటి గెస్ట్‌హౌస్, బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలో దేవస్థానం కౌంటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. అన్ని రకాల ఆర్జిత సేవలు, సమాచారం కౌంటర్లలో అందు బాటులో ఉంటాయని వివరించారు. ఈ నేపథ్యంలో మంగళ వారం విజయవాడ రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్ ఫారం సమీపంలో ఉన్న దేవస్థానం కౌంటర్ ఈవో పరిశీలించారు. యాత్రికుల నిమిత్తం అన్ని ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఈవో దేవస్థాన సిబ్బందిని ఆదేశించారు.



కౌంటర్లను పరిశీలిస్తున్న దుర్గగుడి ఇఒ

అగ్నిమాపక కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ మంగళవారం సందర్శించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు అగ్నిమాపక శాఖ ఆధునీకరణ కోసం కేటాయించిన మొదటి విడుదల 75 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులు అగ్నిమాపక శాఖ ఆధునీకరణ కోసం, కొత్త స్టేషన్ల నిర్మాణం, కొత్త వాహనాలు, ముఖ్యమైన సామాగ్రి కొనుగోలు చేసి ప్రజలకు మరింత సేవ చేసేందుకు శాఖ డీజీ మద్ది రెడ్డి ప్రతాప్ మంచి ప్రణాళికతో ప్రజలకు మరింత సేవలందించేందుకు నిమగ్నమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల అగ్నిమాపక అధికారి ఎ.శివారెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, జిల్లా అధ్యక్షులు రెట్ల నరసింహారావు, జాయింట్ సెక్రెటరీ జి.రాజశేఖర్, హెూంగార్డు అసిస్టెంట్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల రక్షణకు చర్యలు

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మజుందార్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బాలికలు, మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణకు మహిళా కమిషన్ కృషి చేస్తుందని జాతీయ మహిళా కమిషన్ మెంబర్ డాక్టర్ అర్చన మజుందార్ అన్నారు. దేశంలో ఎక్కడ మహిళకు అన్యాయం జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతీయ మహిళా కమిషన్ మూడు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా మొదటి రోజు మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, పాత ప్రభుత్వ వైద్యశాలను జాతీయ మహిళా కమిషన్ మెంబర్ డాక్టర్ అర్చన మజుందార్ సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మజుందార్ మాట్లాడుతూ 10 మంది కంటే ఎక్కువ సిబ్బంది పనిచేస్తున్న ఏ వ్యాపార సంస్థలైనా, విద్యాసంస్థలైనా, కార్యాలయాలైనా ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ కమిటీని సీనియర్ మహిళా ఉద్యోగిని ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం 24 గంటలు మహిళా కమిషన్ అందుబాటులో ఉంటుందని, బాధితులు ఏ సమయమైనా తమకు ఫిర్యాదు చేయవచ్చని, తక్షణం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలు, మహిళల రక్షణ కోసం, వారి సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఐసీసీ (ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ) ఏర్పాటు చేశారా లేదా అని జాతీయ మహిళా కమిషన్ మెంబర్ అర్చన మజుందార్ వాకబు చేశారు. వారం రోజుల్లో ఐసీసీ ఏర్పాటు చేయాలని సూచించారు. కళాశాలలో మహిళ రక్షణ చర్యలపై డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని, హెల్ప్ లైన్ నెంబర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ ఆయా సంస్థల్లో ఏర్పాటు చేసిన ఐసీసీ ద్వారా బాధిత మహిళకు న్యాయం జరగపోతే రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి మహిళా ప్రశాంత వాతావరణంలో పనిచేసేలా మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందని వివరించారు. వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులతో పాటు ఏ రకంగానైనా మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాత ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు బాగున్నాయని, మోర్టాలిటీ రేటు కూడా తక్కువగా ఉందని జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ అర్చన మజుందార్ తెలిపారు. మూడు రోజుల రాష్ట్ర పర్యటన లో భాగంగా మొదటి రోజు మంగళవారం సాయంత్రం విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రిని, వన్ స్టాప్ సెంటర్ ను జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ అర్చన మజుందార్ ఆధ్యంతం అన్ని మహిళా వార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న వన్ స్టాప్ సెంటర్ లో బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.ఏడుకొండల రావు, ఐసిడిఎస్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వాస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న అర్చన మజుందార్


బాధితుడిని పరామర్శించిన సత్యబాబు, తదితరులు

చెట్టుపై నుంచి పడి విఎంసి ఉద్యోగికి గాయాలు

ప్రజా శక్తి - విజయవాడ సిటీ : విఎంసి ఉద్యానవనం విభాగపు అప్కస్ ఉద్యోగి బి.రాము విధి నిర్వహణలో పాడి వీధిలో ఒరిగిన చెట్టు కొమ్మలను తొలిగిస్తున్న క్రమంలో పై నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. తోటి ఉద్యోగులిచ్చిన సమాచారంతో సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు ఆసుపత్రికి వెళ్లి రామును పరామర్శించారు. బాధితుని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులనడిగి తెలుసుకున్నారు. డాక్టర్లను మెరుగైన వైద్య చికిత్స అందించాలని కోరారు. సత్యబాబు మాట్లాడుతూ పార్క్ సెక్షన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. విధి నిర్వహణలో రక్షణ పరికరాలు ధరించకుండా, చెట్లు నరికే క్రమంలో ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. తగిన నైపుణ్యం శిక్షణ కల్పించి భద్రత ప్రమాణాలను పాటించి కార్మికులకు ప్రమాదాల నుండి రక్షించాలని కమిషనర్‌కి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నగర ఆర్గనైజింగ్ సెక్రెటరీ టి.ప్రవీణ్, సెక్షన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చిన్న వెంకటరమణ, రాజు, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మట్టి కోసం వివాదం

ప్రజాశక్తి - మైలవరం : మట్టి బంగారం అయింది. ఆ మట్టి అధికార పార్టీ నాయకుల మధ్య చిచ్చు రాజేస్తుంది. నీ ఒక్కడిదా చెరువు పంచాయతీకి సంబంధించింది, మేము మట్టి తోలుకుంటాంను అంటే నేను అంటూ, నువ్వెంత అంటే నువ్వెంత అంటూ అధికార పార్టీ నాయకులు మధ్య మాట మాట పెరిగి రెండు గ్రామాల వారు రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దారితీసింది. ఈ సంఘటన జిల్లా మైలవరం మండలం పుల్లూరు సమీపంలోని దాసులపాలెం జాతీయ రహదారి బొర్రగూడెం చెరువు వద్ద మంగళవారం జరిగింది. వివరాల్లోకెళ్తే పుల్లూరు సమీపంలో జాతీయ రహదారి కానుకొని చంద్రగూడెం పంచాయతీ పరిధిలోని బొర్రగూడెం చెరువు సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద 200 ఎకరాలకు పైగా రైతులు పంట పొలాలున్నాయి. అయితే బొర్ర గూడెం గ్రామం అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు గత 20 రోజులుగా చెరువు మట్టిని తరలిస్తున్నారు. మంగళవారం చంద్రగూడెం గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన నాయకులు, మా పంచాయతీ పరిధిలోని చెరువు కాబట్టి మేము కూడా మట్టి తోలుకుంటామని కొన్ని ట్రాక్టర్లను తీసుకువచ్చి మట్టి తోలే ప్రయత్నం చేశారు. దీంతో బొర్రగూడెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, చెరువు అధ్యక్షులు వర్గం ట్రాక్టర్లు అడ్డుపెట్టి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాలు గొడవకు దిగాయి. సుమారు రెండు మూడు గంటలకు పైగానే సాగిన గొడవ పోలీసుల జోక్యంతో సర్దుమణిగింది.



నగరంలో మా రాముడు అందరివాడు షూటింగ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ నగరంలో మా రాముడు అందరివాడు చిత్ర షూటింగ్ సన్నివేశాలు చరవేగంగా సాగుతున్నాయి. హనుమాన్ పేటలోని ఆలపాటి రామారావు ఫంక్షన్ హాల్‌లో ముఖ్యమంత్రిగా హీరో సుమన్ ముఖ్యమంత్రి పాత్రలో గ్రామానికి సంబంధించి ఎమ్మెల్యే, గ్రామస్తులు మధ్య జరిగే సంభాషణను చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను వెల్లడించేందుకు చిత్ర యూనిట్ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ దర్శకుడు మైఖేల్ కథ తెలిపిన వెంటనే నటించడానికి అంగీకరించినట్లు తెలిపారు. చిన్న చిత్రాల్లో మంచి కథాంశం, ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారన్నారు. చిన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని, నటీనటులను ప్రోత్సహించాలని కోరారు. సినీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తే మరింతగా చిత్ర పరిశ్రమ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం హీరో శ్రీరామ్ మాట్లాడుతూ జూన్ 26న మా రాముడు అందరివాడు చిత్ర ట్రైలరును విడుదల చేస్తున్నట్లు విజయదశమి రోజున తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు తాను తొమ్మిది చిత్రాల్లో నటించానని తెలుగు ప్రేక్షకులు తనను ఎంతగానో ఆదరిస్తున్నారని ఈ చిత్రాన్ని కూడా ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని కోరారు. త్వరలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ అనే చిత్రంలో నటిస్తున్నానని, మా రాముడు అందరివాడు చిత్రం అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉంటుందని అన్నారు. ఈ చిత్రంలో సీనియర్ హీరో సుమన్ నటించిన తమకెంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దర్శకుడు మైకేల్ మాట్లాడుతూ పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యమున్న చిత్రాన్ని అద్భుతంగా తీస్తున్నట్లు తెలిపారు. మారేడుమిల్లి ప్రాంతంలో చిత్ర నిర్మాణం 80శాతం చేశామని మిగిలిన 20 శాతాన్ని విజయవాడ చుట్టుపక్క ప్రాంతాలు నెల్లూరు నగరంలో చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమాలో హీరో సుమన్ ముఖ్యమంత్రి పాత్రలో నటిస్తున్నారని, సినిమాలో హీరోగా శ్రీరామ్ నటిస్తున్నట్లు చెప్పారు. ఒక నియోజకవర్గంలోని గ్రామంలో సమస్యలు, అభివృద్ధిపై ఎమ్మెల్యే గ్రామస్తుల మధ్య జరిగే సన్నివేశాలు ఆసక్తికరంగా చిత్రీకరించడం జరిగిందంటూ వివరించారు. చిత్ర నిర్మాత అనుముల లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అవినీతి ఆక్రమాలపై నిలదీసే సన్నివేశాలు ఈ చిత్రంలో నిజ జీవితానికి దగ్గరగా ఉండేలా చిత్ర నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. ఈ చిత్రంలో ప్రముఖ నటీ నటులు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నట్లు వివరించారు.


మాట్లాడుతున్న నటుడు సుమన్